క్లుప్తంగా

మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



మూలపేటలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక: ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి



విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 శివలింగనాయుడు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని ఎంఈవో-2 బి.ఎస్.శివలింగనాయుడు తెలిపారు.మండలంలోని పల్లపు ఆనందపురం ,కుమారపురం పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల పుస్తకాలు పరిశీలించడంతో పాటు పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం వంటకాలను రుచి చూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఉపాధ్యాయులు కృపారాణి,క్లస్టర్ రిజర్వుడ్ టీచర్ కర్రి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సూర్యనారాయణ కుటుంబ సభ్యులు

మునగపాక: మాజీ మునసబు, దివంగత పెంటకోట సూర్యనారాయణ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సూరిశెట్టి రాము, సూర్యనారాయణ కుమారులు పి.వి.వి. నాగేంద్ర(విష్ణు),పి.మల్లేశ్వరరావు, గ్రామ పెద్దలు టెక్కలి వీర కొండలరావు,పెంటకోట వెంకట్, ఎం.ఎం.నాయుడు,పెంటకోట రాజు, భరణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

మునగపాక: మండలంలోని వెంకటాపురం సమీపంలో పరవాడ రోడ్డులో శుక్రవారం ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ వాహన తనిఖీలు నిర్వహించారు.ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ , మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటిన హెచ్ఎం రుధిరారాణి, ఎస్‌బీఐ ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో అనకాపల్లి ఎస్‌బీఐ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం రుధిరారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కల్ని నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. మొక్కల ద్వారానే మనిషికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉద్యోగులు, విశ్రాంత ఎస్‌సీ అధికారి ఎస్.సీలావతి, హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు లెక్కల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

స్థానిక ఉప ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శనివారం జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి అధికారులు అవగాహన కల్పించారు. పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు.అనంతరం 2 గంటల నుంచి ఓట్లు లెక్కింపు ప్రారంభించి ఫలితాలు విడుదల చేస్తారు.



కొరుప్రోలులో సూచనలిస్తున్న ఆర్వో వెంకటనారాయణ



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న నక్కపల్లి సీఐ అప్పన్న

ఎస్.రాయవరం: పకడ్బందీగా ఉప ఎన్నికలు నిర్వహించాలని ఆర్వో వెంకటనారాయణ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి కొరుప్రోలు సచివాలయంలో శుక్రవారం సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జరగనున్న కొరుపోలు సర్పంచ్ ఎన్నికలో 3,283 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. 12 వార్డులకు 12 బూత్‌లు కేటాయించి పోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాల భవనంలో 6 బూత్‌లు, వెల్‌నెస్ సెంటర్ భవనంలో 3 ,రైతుబరోసా కేంద్రంలో 3 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. లింగరాజుపాలెంలో 5 వ వార్డు మెంబర్ ఉప ఎన్నిక కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వీఆర్వో రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కొరుప్రోలు సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్ఐ ప్రసాద్‌రావు పరిశీలించారు. నలుగురు ఎస్ఐలతో కలిసి 25 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని ఎస్ఐ ప్రసాద్‌రావు చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం సాయంత్రం ఫలితాలు వెల్లడించే వరకు పోలీస్ పికెట్ కొనసాగుతుందని తెలిపారు.

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు పంచాయతీ ఒకటో వార్డుకు శనివారం ఉప ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు తెలిపారు.

ఇక్కడ వార్డు మెంబరుగా గతంలో గెలుపొందిన వెలగా ఈశ్వరరావు ఎంపీటీసీగా విజయం సాధించి వైస్ ఎంపీపీగా ఎంపిక కావడంతో వార్డు సభ్యుడి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బాక్సులు, బ్యాలెట్‌పేపర్లతో సిబ్బంది శుక్రవారం గ్రామానికి వెళ్లారు.ఈ వార్డులో 317 మంది ఓటర్లు ఉన్నారు.

మునగపాక: మండలంలోని మెలిపాక వార్డు సభ్యుని ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల అధికారి ప్రసాద్ తెలిపారు. గతంలో ఎన్నికైన వార్డు సభ్యుడు మృతిచెందడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇక్కడ ఉప ఎన్నిక జరుగుతోందన్నారు. ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 184 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేశామని చెప్పారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

144వ సెక్షన్ అమలు

మండలంలోని మెలిపాక వార్డు సభ్యుని ఉప ఎన్నిక సందర్భంగా 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సంబంధిత వార్డు పరిధిలోని ఓటర్లు తప్ప పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వరకు ఇతరులు ఎవరూ రాకూడదన్నారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మొత్తం మూడు స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా హరిపాలెం,మోసయ్యపేట పంచాయతీల పరిధిలోని రెండు వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన దిబ్బపాలెంలో 4వ వార్డు స్థానానికి శనివారం ఎన్నిక జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లుపూర్తి చేశారు. 450 ఓటర్లు ఉన్న ఈ వార్డు స్థానానికి పోలవరపు చిట్టి బాబు, కసిరెడ్డి జయలక్ష్మి పోటీ పడుతున్నారు. ఎస్ఐ సన్యాసినాయుడు పోలింగ్ బూత్‌ను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఎన్నికల సిబ్బంది ఇప్పటికే ఎన్నికల కేంద్రానికి చేరుకున్నారు.



సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేస్తున్న అధికారులు



మెలిపాక పోలింగ్ కేంద్రం



బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీదే విజయం



నియోజకవర్గ పరిశీలకుడు గురుమూర్తిరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీదే విజయమని, రాష్ట్ర ప్రజలు సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి అన్నారు. మండలంలోని రామచంద్రపురం శివారు శ్రీపతిరాజు అతిథి గృహంలో నియోజకవర్గ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన తిప్పల గురుమూర్తిరెడ్డిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులతో పాటు నియోజకవర్గ కన్వీనర్లు, గృహసారథులు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు, శీరం నర్సింహమూర్తి, దనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబు, శ్రీపతి రాజు, బాబ్జీ, చంటి పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



ఉపమాకలోని మహాలక్ష్మిఅమ్మవారు



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



దుర్గాదేవి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

నక్కపల్లి: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయాలు, ఇళ్లలో మహాలక్ష్మి అమ్మవారికి విశేషంగా పూజలు చేశారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి,లక్ష్మణేశ్వరస్వామియంలో పార్వతిదేవికి తొలి శుక్రవారం ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. లోగిళ్లన్నీ శోభను సంతరించుకున్నాయి. పూజా సామగ్రి, పండ్లు ,కొబ్బరి కాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొబ్బరి కాయ రూ.30, అరటి పళ్లు డజను రూ.40, పువ్వులు కిలో రూ.360కు విక్రయించారు.

దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

యలమంచిలి: మండలంలోని పద్మనాభరాజు పేట గ్రామంలో దుర్గాదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కుంకుమ పూజలు చేశారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు హరి భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. సర్పంచ్ గొన్నాబత్తుల శివలక్ష్మి,శివ దంపతులు, మాజీ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు,సూర్యకళ దంపతులు, జెర్రిపోతుల వెంకటరావు,లక్ష్మి దంపతులు, గోవిందరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పూటకూటి శేఖర్, కమిటీ సభ్యులు మొగ్గా బుజ్జి, జెర్రిపోతుల నానాజీ, రాయవరపు వెంకట్, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

డీసీసీబీ ఛైర్మన్ కోలా గురువులు



డీసీసీబీ ఛైర్మన్‌ను సత్కరిస్తున్న నాయకులు

నక్కపల్లి: జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషిచేస్తానని జిల్లాకేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కోలా గురువులు తెలిపారు. జిల్లాకేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన కోలా గురువులను పాయకరావుపేట నియోజకవర్గానికిచెందిన పలువురు పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జులు, నాయకులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వీలైనంత ఎక్కువ మొత్తంలో తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువులను సన్మానించిన వారిలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వేంపాడు,గొడిచర్ల పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జులు అయినంపూడి మణిరాజు,పొడగట్ల పాపారావు, ఎస్‌రాయవరం మాజీ ఎంపీపీ బొలిశెట్టి గోవిందు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు తదితరులున్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో అద్భుతాల ఆవిష్కరణ

అనకాపల్లిటౌన్: మనిషి మేధస్సు చేయగలిగే పనులను కృత్రిమ మేధ(ఏఐ) కలిగిన యంత్రాలతో కూడా చేయవచ్చని కృత్రిమ మేధ నిపుణుడు ఎల్.వెంకట విజయ్ తెలిపారు. స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో కృత్రిమ మేధపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ సాంకేతికతో పనిచేసే రోబోలు, కంప్యూటర్లతో ఊహించని అద్భుతాలు జరిగే రోజులు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. మనిషిలా ఆలోచిస్తూ, మనిషి మెదడు పనితీరును అధ్యయం చేసి, పనిచేసేలా సాఫ్ట్‌వేర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు కంప్యూటర్ సైన్స్, మనో వైజ్ఞానిక, బయాలజీ, గణితం, సామాజిక, తత్వశాస్త్రాల పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ ఏఐ కంప్యూటర్లు అనేక భాషలను అర్థం చేసుకుని స్వతహాగా సంభాషించే సాంకేతికతను కలిగి ఉంటున్నాయని తెలిపారు. వైద్యరంగంలో ప్రస్తుత సాంకేతికత పరిజ్ఞానంతో గుర్తించలేని పలు వ్యాధులను ఏఐ ద్వారా సులభంగా గుర్తిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయా మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్డు, బోరు ఏర్పాటుకు భూమి పూజ



షెడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు శివారు నీలాద్రిపురం గ్రామంలో శ్మశాన వాటిక వద్ద షెడ్డు నిర్మించి, బోరు వేసేందుకు శుక్రవారం భూమిపూజ చేశారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తుల కోరిన మేరకు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రూ.4 లక్షల కేటాయించినట్టు వైఎస్సార్ సీపీ నాయకుడు వెలగా శ్రీనివాసరావు చెప్పారు. బోరు ఏర్పాటుకు రూ.3 లక్షలు, షెడ్డుకు రూ.లక్షచొప్పున కేటాయించారన్నారు. భూమిపూజ కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలపాటి మణిరాజు, యేజర్ల సీతారామరాజు,దాట్ల సూర్యనారాయణరాజు,కందికొండ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో నాట్లు వేస్తే మేలు



డ్రమ్ సీడర్ సహాయంతో వరినారు నాటే విధానం వివరిస్తున్న వ్యవసాయాధికారి

యలమంచిలి : డ్రమ్ సీడర్ సాయంతో వరినాట్లు వేయడం వల్ల మేలు జరుగుతుందని వ్యవసాయ విస్తరణాధికారులు తెలిపారు. మండలంలోని రామారాయుడుపాలెం గ్రామంలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ పద్ధతి కంటే ఈ విధానం వల్ల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా వరి సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న వారు వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రవిప్రకాష్, వ్యవసాయ శాఖ ఇబ్బంది, రైతులు చిరంజీవి, మంగమ్మ, అంకంరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా వరినాట్లు



నారాయణపురం సమీపంలో నాట్లు వేస్తున్న రైతులు




శారద నదిలో నీరు

- తగినంతగా లేని సాగు నీరు
- శారదా నదిలో తగ్గిన ప్రవాహం

రాంబిల్లి: వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. వరుణుడు కరుణించపోవడంతో రైతులు అవస్థలకు గురవుతున్నారు. శారద నదిలో నీటి ప్రవాహం తగ్గింది. ఫలితంగా సాగునీటి కాలువల్లో అంతంతమాత్రంగా నీరు ప్రవహిస్తోంది. ఈ నీరు పల్లపు పొలాలకు మాత్రమే అందుతోంది. మెరక ప్రాంతాల్లో పొలాలకు నీరు అందడం లేదు. పలుచోట్ల నారుమడులకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శారద నదిలోని నీటితో పాటు నేల బావుల్లో నీటిని మోటార్ల సాయంతో తోడి పలు ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు. పలుచోట్ల ట్రాక్టర్ల సాయంతో దమ్ములు పూర్తి చేశారు. ఈ తరుణంలో నీటి సమస్య ఏర్పడింది. మండలంలో ఎనిమిది వేల ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు.

ఈ మేరకు వరి విత్తనాలు వేశారు. చాలావరకు వరినారు ఆశాజనకంగానే పెరిగింది. ఇప్పటివరకు సుమారు 980 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. నాట్లు వేసిన చోట్ల ఈ క్రాప్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మూడు రోజులుగా ఆకాశం దట్టంగా మేఘావృతమైనా చిన్నపాటి చినుకులు మాత్రమే పడుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందులు తప్పుతాయని అన్నదాతలు చెబుతున్నారు. వర్షాలు పడి శారద నదిలో నీరు పెరిగితే వారం, పది రోజుల్లోనే వరినాట్లు పూర్తి అయ్యే అవకాశాలున్నాయి.


నదిలో నీరు తోడి నాట్లు



మూడు ఎకరాల్లో వరి నాట్లు వేశాను. శారద నదిలో నీరు తక్కువగా ఉండడంతో మోటారు సాయంతో తోడి నాట్లు వేశాను. వర్షాలు పడి నదిలో నీరు పెరిగితే సాగునీరు ఇబ్బందులు ఉండవు.

-జి. అప్పలనాయుడు, రైతు

నీటి కొరతతో ఆలస్యం



మండలంలో పలు ప్రాంతాల్లో వరినాట్లు పనులు జరుగుతున్నాయి. వరినాట్లు పడే సమయంలో వర్షాలు లేకుండా పోయాయి. మరోపక్క శారద నదిలో నీరు తగ్గింది.నీటి ఎద్దడితో నాట్లు ఆలస్యమవుతున్నాయి. వర్షాలు కురిస్తే నాట్లు పూర్తవుతాయి.

- సి.సుమంత, వ్యవసాయాధికారి, రాంబిల్లి

చిన్నారుల గానామృతం



పాటల పోటీలకు హాజరైన అతిథులు, చిన్నారులు

పాయకరావుపేట : చిన్నారులు తమ గానామృతంతో ఆహూతులను ఓలలాడించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 47 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం పాఠశాలల విద్యార్థులకు జూనియర్ విభాగంలోనూ, శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులకు సీనియర్ విభాగంలోనూ గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా హాజరైన గాయకులు సుప్రీమ్ శేఖర్, కీ బోర్డు ప్లేయర్ జి.రామారావు మాట్లాడుతూ విద్యార్థులు మధురంగా ఆలపించారని చెప్పారు. విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మధురమైన పాత పాటలను, వాటి భావాలను ఆస్వాదించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కన్వీనర్ సీతారాణి, ఏపీపీఎస్సీ మెంబర్ సోనివుడ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible] ... ఓ.ఎస్ నెం.4/2022 ... [illegible]

షెడ్యూలు: [illegible]
తూర్పు : రోడ్డు   దక్షిణం : రోడ్డు
పడమర : [illegible]   ఉత్తరం : రోడ్డు
బి-షెడ్యూలు : [illegible] ... డోర్ నెం.17-40 ... [illegible]

సలుగు కృష్ణ శేఖర్, అడ్వకేట్

[illegible]

పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ



ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జెడ్సీ చక్రవర్తి

అనకాపల్లిటౌన్: వర్షాలు పడుతున్న సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. స్థానిక గవరపాలెం సతకంపట్టు గౌరీపరమేశ్వరుల ఆలయ సమీపంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో టైర్లు, కాలువలు, పాత్రల్లో నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. ఇలాంటి నీటిలోనే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజిని, మలేరియా ఇన్‌స్పెక్టర్ సీహెచ్ గణేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

యోగా పోటీలో దైవజ్ఞ ప్రతిభ



తృతీయ స్థానం పొందిన దైవజ్ఞకు అభినందన

కశింకోట: జాతీయ స్థాయి యోగా పోటీలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌కి చెందిన విద్యార్థి ఎం.దైవజ్ఞ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రూపానంది శుక్రవారం తెలిపారు. ఇటీవల బెంగళూరులోని శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ యోగా ఆన్‌లైన్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీలో తమ స్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి దైవజ్ఞ 8 ఏళ్ల లోపు విభాగంలో మూడో స్థానంలో నిలిచి జ్ఞాపిక, సర్టిఫికెట్ పొందినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విజేతను స్కూల్ అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నేత్రపర్వంగా సుదర్శన హోమం

అనకాపల్లిటౌన్: మండలంలోని రాజుపాలెం దరి లలితాదేవి పీఠంలో శుక్రవారం శ్రావణమాస పూజలు నేత్రపర్వంగా జరిగాయి. వేద పండితులు, వాస్తు సిద్ధాంతి ఎం.రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీకమలం పుష్పాలతో పూజ, సుదర్శన హోమాన్ని శ్రీశైల దేవస్థానం చండీ ఉపాసకులు షణ్ముఖశర్మ నిర్వహించారు. దంపతులచే పూజా కార్యక్రమాలు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.